శ్మశానవాటికలో.. సమస్యలెన్నో..



హఫీజ్‌పేట్ అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న ఎస్సీ శ్మశానవాటిక



జీహెచ్ఎంసీ పరిధిలోని హఫీజ్‌పేట్ అంబేద్కర్‌నగర్ శ్మశానవాటికలో కనీస వసతులు కరువయ్యాయి. సౌకర్యాలు కల్పించాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2012 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పట్టించుకున్న వారు లేరు. శ్మశానవాటిక విస్తీర్ణం మూడు ఎకరాలు ఉండగా ఇప్పుడు 1.20 ఎకరా ఉంది. పిచ్చిమొక్కలు పెరగడంతో పాములు సంచరిస్తున్నాయి. చెత్త చెదారం, మట్టికుప్పల మధ్యలో ఉన్న మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఇక శ్మశానవాటిక కమాన్ అసంపూర్తిగా ఉంది. శ్మశానవాటికలో స్నానపు గదులు, దహన సంస్కారాలకు ప్రత్యేకంగా దిమ్మెల ఏర్పాటు, వాటిక చుట్టు ప్రహరీగోడ నిర్మించడంతో బాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని బస్తీ వాసులు కోరుతున్నారు.
– చందానగర్



శ్మశానవాటికలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



అసంపూర్తిగా శ్మశానవాటిక కమాన్

వెంటనే పనులు ప్రారంభించాలి



హఫీజ్‌పేట్ ఎస్సీ శ్మశానవాటికలో కనీస వసతులు లేక స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోజు కొంతమంది వచ్చి శ్మశానవాటిక పక్కన తమ స్థలం ఉందంటూ సర్వేలు చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి.
–రాజు, అంబేద్కర్ కాలనీ

నిధులు కేటాయించాలి



ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. దహన సంస్కారాలకు కావలసిన కనీస వసతులు ఏర్పాటు చేయాలి. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలి. చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి.
– ధన్‌రాజ్, అంబేద్కర్ కాలనీ

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందజేత



మంజూరు పత్రంను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌కు చెందిన నాగరాజుకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.2 లక్షలు మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే గాంధీ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, చంద్రకాంత్‌రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. గురువారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీఅయిన, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం వారిని సన్మానించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రత్నప్రభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బలరాం, శివకుమార్, పరమేష్, చంద్రప్రణేష్‌రెడ్డి, రాజయ్య, అనంతయ్య, గోపాల్, వెంకట రామిరెడ్డి, యాదమ్మ, షమీం, శారద, స్వర్ణలత, భాగ్యలక్ష్మి, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మపాలతో ఆరోగ్యం

కిమ్స్ కడల్స్ కొండాపూర్ క్లినికల్ డైరెక్టర్ డా.అపర్ణ



రాయదుర్గం: అమ్మపాలు ఆరోగ్యకరమని కిమ్స్ కడల్స్ కొండాపూర్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ అపర్ణ తెలిపారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ప్రతియేటా తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. శిశువు పుట్టిన తర్వాత ఒక గంటలోపు తల్లిపాలు ఇవ్వడం, ఆ తర్వాత ఆరుమాసాల పాటు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు తక్కువ రావడానికి గల కారణాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు, ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు, కుటుంబాలు, సమాజం తల్లిపాలను రక్షించడం, ప్రోత్సహించడంలో కిమ్స్ కడల్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కిమ్స్ కడల్స్‌లోని టీమ్ శిశువు పుట్టినప్పుడు సంరక్షించే మొదటి వ్యక్తులలో ఒకటిగా ఉందన్నారు.

విద్యార్థినికి లయన్స్ క్లబ్ ప్రోత్సాహం



విద్యార్థిని మౌనికరెడ్డికి ఆర్థిక సహాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ తదితరులు

చందానగర్ : చందానగర్ హుడా కాలనీకి చెందిన రంగారెడ్డి కుమార్తె మౌనిక రెడ్డి విద్య కోసం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం రూ.30వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా జోన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతుందని ఆమెకు విద్యకు కావలన ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి భూషణ్‌రెడ్డి, ట్రెజరర్ రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మారం వెంకట్, నూకల సందీప్, మారం ప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథను పూర్తి చేయాలి

పటాన్‌చెరు: మిషన్ భగీరథను త్వరగా పూర్తి చేయకుంటే నిరాహార దీక్ష చేస్తామని బొల్లారం మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ వారాల గోపాలమ్మ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ రోడ్లన్నీ ధ్వంసం చేసి ప్రజలు నరకయాతన అనుభవిస్తుంటే పాలకవర్గం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇంటింటికి మంచి నీళ్ల ఇవ్వాల్సిన పాలకవర్గం మిషన్ భగీరథ పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకవర్గం ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మిషన్ భగీరథ పూర్తి చేసి వెంటనే రోడ్లు నిర్మించాలని కోరారు.లేని ఎడల నిరాహారదీక్ష చేస్తానని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు.

సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వగానే సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేస్తామనడంపై హర్షం వ్యక్తం చేశారు. 50 ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించినట్లయిందన్నారు. మూడు దశాబ్దాలుగా పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ, ఇతర ఉద్యమకారులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

న్యాయం జరిగింది..

మాదిగల ఎస్సీ వర్గీకరణ కోసం చేస్తున్న పోరాటానికి న్యాయం లభించిందని కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి గౌరవ అధ్యక్షుడు టి కృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో మాదిగ వర్గాల్లో ఆనందం వ్యక్తం అవుతోందన్నారు. తెలంగాణ మాదిగ దండోరా గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కాలేబస్వరాజ్ మాట్లాడుతూ వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి సార్థకత చేకూరినట్లయిందన్నారు.

ప్రజాపాలన కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలి

వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



రాయదుర్గం: ప్రజాపాలన కేంద్రాలను అత్యంత పటిష్టంగా నిర్వహించాలని జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సూచించారు. గురువారం వెస్ట్‌జోన్ పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్‌ను గచ్చిబౌలిలోని వెస్ట్‌జోన్ కార్యాలయం నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వినతులను స్వీకరించడంతోపాటు పరిష్కారానికి చర్యలు కూడా చేపట్టాలని ఆదేశించారు. వార్డుకో ప్రజాపాలనా కేంద్రం అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేయాలని సూచించారు. జోన్ వ్యాప్తంగా సినిమాహాల్స్, మాల్స్‌లలో పార్కింగ్, తినుబండారాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణను పకడ్బందీగా చేయాలన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛ ఆటో వెళ్లేలా, ప్రతి వాణిజ్య దుకాణం ఎదుట డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకునేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఫాగింగ్‌ను నిర్లక్ష్యం చేయవద్దని ముందుస్తుగా కాలనీలకు సమాచారం అందించాలన్నారు. ప్రతి శుక్రవారం వాలంటీర్లతో కాలనీలలో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున రహదారులపై ఏర్పడ్డ గుంతలను తక్షణమే పూడ్చివేయాలని, దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. ఈనెల 15వ తేదీలోగా పూర్తి స్థాయిలో జీవీపీలను ఎత్తి వేయాలని చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో డిప్యూటీ కమిషనర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, మెడికల్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఎంటమాలజీ విభాగం, ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 40, పచ్చిమిర్చి 60, బెండ 40, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 40, చామ 60, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 90, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 200, వెల్లుల్లి 280.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పటాన్‌చెరు టౌన్: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నివారణపై గురువారం పటాన్‌చెరు ఎంపీపీ సమావేశ మందిరంలో అవగాహన సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అధికారులు, గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశానికి హాజరైన మండల ప్రత్యేక అధికారి దేవుజా మాట్లాడుతూ... గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం దోమలు, ఈగలు పెరిగే అవకాశం ఉందని పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు కనిపిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. వైద్యాధికారులు, సిబ్బంది ఇంటింటికి తిరిగి వ్యాధులపై అవగాహన కలిగిస్తూ, సమస్య ఉన్నచోట పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం డాక్టర్ దీప్తి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బోదకాలు వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని, ఈ నెల 10 నుంచి 25 వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, ఎంపీఓ హరిశంకర్ గౌడ్, ఎంఈఓ పీపీ రాథోడ్, శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

20 కిలోమీటర్ల రేడియస్‌లో ఉచిత కార్ పాస్ ఇవ్వాలి



టోల్ ప్లాజా యాజమాన్యానికి వినతిపత్రం ఇస్తున్న జిల్లా అధ్యక్షురాలు గోదావరి

పటాన్‌చెరు టౌన్: టోల్ ప్లాజా 20 కిలోమీటర్ల రేడియస్‌లో ఉన్న వారికి ఉచిత కార్ పాస్ ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం గుమ్మడిదల నేషనల్ హైవే టోల్‌ప్లాజా యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిన్నారం, గుమ్మడిదల మండలం ప్రజలకు నేషనల్ హైవే లా గెజిటెడ్ ప్రకారం ఉచిత ఫోర్ వీలర్ కార్ పాస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అంజి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గిద్దె రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు పటాన్‌చెరు నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, వివిధ మండలాల అధ్యక్షులు, కన్వీనర్లు, కో కన్వీనర్లు, డివిజన్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

షీ టీంలు, సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ సోమేశ్వరి

పటాన్‌చెరు టౌన్: మహిళల రక్షణ కోసమే షీ టీంలు ఉన్నాయని అమీన్‌పూర్ ఎస్ఐ సోమేశ్వరి అన్నారు.జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో, మిషన్ శక్తి సంకల్ప్ కింద వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా గురువారం ఐలాపూర్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, షీ టీమ్, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆన్‌లైన్ భద్రత, లింగ సమానత్వం, లింగ వివక్ష, సఖి సర్వీసెస్, చైల్డ్ లైన్ సేవలు ,సైబర్ నేరాలు, పిల్లల అక్రమ రవాణా ,మాదక ద్రవ్యాల నివారణ, పోషకాహారం,హెల్ప్ లైన్ నంబర్లు (1098,100, 181,112,1930) గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీరామ్, అమీన్‌పూర్ ఏఎస్ఐ బొజ్యా నాయక్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి, షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ , గ్రామ పంచాయతీ సెక్రటరీ సచిన్‌కుమార్ ,మాజీ సర్పంచ్ రవి పాల్గొన్నారు.

పాలాభిషేకం

చందానగర్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై తీర్పు వచ్చిన నేపథ్యంలో అంబేద్కర్ యూత్ ఫోర్స్ అసోసియేషన్ గురువారం చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాఘవేందర్, అర్జున్‌రావు, జయంత్ రాజ్, నర్సింగ్ రావు, కుమార్, నరేందర్ పాల్గొన్నారు.



పనుల్లో వేగం పెంచాలి

ఎమ్మెల్యే గాంధీ



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుంచి మాధవరం నగర్ కాలనీ హైటెన్షన్ లైన్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు , సీసీ రోడ్డు పనులను గురువారం ఎమ్మెల్యే గాంధీ, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వర్టు నిర్మాణంతో ఇక్కడి ప్రాంత ప్రజలకు ప్రయాణ దూరం, సమయం, ఇంధనం ఆదా అవుతుందన్నారు. రోడ్డు పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ అధికారులు ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురివిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, బాలింగ్ గౌతమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన



ఆల్విన్ కాలనీ చౌరస్తాలో జాతీయ రహదారిపై ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

చందానగర్ : సీఎం రేవంత్‌రెడి అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, కార్పొరేటర్ రోజాదేవి రంగారావులు అన్నారు. గురువారం మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తాలోని జాతీయ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకుల ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసనలు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ ఆడబిడ్డలను అవమానపరిచే రీతిలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం తగదన్నారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో మియాపూర్ పోలీసులు వారందరిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారందరిని విడుదల చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాధవరం రంగారావు, పురుషోత్తం యాదవ్, వాలా హరీష్‌రావు, పెద్ద భాస్కర్, భద్రన్న, రవి యాదవ్, మల్లారెడ్డి, తిరుమలేష్, బిఎస్ఎన్ కిరణ్ యాదవ్, జనార్దన్ గౌడ్, బాబు మోహన్ మల్లేష్, దారుగుపల్లి నరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



ఇరిగేషన్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు, అలీతలాబ్ చెరువు, భీమునికుంట, కిందికుంట, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువుల సుందరీకరణ పనులు, అభివృద్ధి పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులతో గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని అంబీర్ చెరువు, అలీతలాబ్ చెరువు, భీమునికుంట, కిందికుంట, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. చెరువులో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజీ వ్యవస్థ మళ్లింపు పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గుర్రపు డెక్కను తొలగించి దోమల బెడద నుంచి ప్రజలను కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో డీఈ నరేందర్, ఏఈ విశ్వం తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ అభివృద్ధే ధ్యేయం

కార్పొరేటర్ శ్రీనివాసరావు



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీ లేక్ వ్యూ విల్లాస్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై గురువారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, జీహెచ్‌యంసీ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని, దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు మాధవరావు, నాగిరెడ్డి, శ్రీనివాస్, కొలన్ సంజీవరెడ్డి, కొలన్ చంద్రమోహన్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, బన్నయ్య, సంపత్, వెంకట్, యాదిరెడ్డి, నాయకులు నిరంజన్‌గౌడ్, మాధవరావు, నిఖిల్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి.. కేసు నమోదు

చందానగర్ : గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై మాదాపూర్ ఎస్ఓటీ, చందానగర్ పోలీసులు దాడి చేశారు. గురువారం సీఐ పాలవెల్లి తెలిపిన ప్రకారం.. బీహెచ్‌ఈఎల్ ఎంఐజీకి చెందిన రాజు జులై 1వ తేదీ ఎంఐజీలోని ఇంటి నంబర్ 1546 ఇంటిని అద్దెకు తీసుకొని రాజమండ్రికి చెందిన లక్ష్మీని ఇంట్లో పని చేయాలని చెప్పాడు. కాగా గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాదాపూర్ ఎస్ఓటీ, చందానగర్ పోలీసులు బుధవారం రాత్రి వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై దాడి చేశారు. చందానగర్‌కు చెందిన వెంకట సతీష్, కె.విజయ్‌కుమార్‌లతో పాటు ఓ యువతిని, ఇంట్లో పని చేస్తున్న లక్ష్మిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరందరిపై కేసు నమోదు చేశారు. నిర్వాహకుడు రాజు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఇద్దరు అదృశ్యం

రాయదుర్గం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..తూర్పుగోదావరికి చెందిన సాయిశ్రావణి (19)తల్లిదండ్రులతో కలిసి మసీదుబండలోని లాంబ్సా అపార్ట్‌మెంట్‌లో హౌస్‌కీపింగ్ పనులు చేస్తూ సుదర్శన్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఈనెల 30వ తేదీన ఇంటి నుంచి ఆమె ఉదయం 7.30 గంటలకు పని నిమిత్తం లాంబ్సా అపార్ట్‌మెంట్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తండ్రి శ్రీరాములు పలుచోట్ల వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

మరో ఘటనలో వృద్ధురాలు..

చందానగర్ : ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నల్లగండ్లలో నివాసముండే వడ్డె నర్సమ్మ (60) జులై 26వ తేదీ ఉదయం 5.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వృద్ధురాలు 5 అడుగులు ఎత్తు ఉంటుందని తెలుగు, కన్నడ భాషలు మాట్లాడగలదని పోలీసులకు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి



చందానగర్ : గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం లింగంపల్లి ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ 6వ నంబర్ ప్లాట్ ఫారం వైపు ఉన్న పార్కింగ్ స్థలంలో గుర్తు తెలియని మహిళ పడి ఉన్నట్లు గురువారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.